ప్రజాశక్తి
మంగళవారం 22 జులై 2025
పార్వతీపురం మన్యం



రోగులతో ఏరియా ఆసుపత్రి కిటకిట


ఒపి కౌంటర్ వద్ద క్యూకట్టిన రోగులు

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రి గత కొద్దిరోజులుగా రోగులతో కిటకిటలాడుతుంది. ఇటీవల వర్షాలు కురవడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటా జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. ఈమేరకు సోమవారం ఏరియా ఆసుపత్రిలో రోగులతో కిటకిటలాడింది. ఒక్కరోజే 371 ఓపి రాగా వీటిలో జ్వరంతో 120 మంది జ్వరాలతో బాధపడుతుండగా, మరో 16 మంది మలేరియా అనుమానితులుగా గుర్తించినట్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ బి శ్రీనివాసరావు తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి

అంగన్‌వాడీల ఆందోళన

సిడిపిఒలకు వినతులు



బలిజిపేట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పార్వతీపురం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - బలిజిపేట

బాలింతలకు, గర్భిణీలకు, చిన్నారులకు అంగనవాడీని దూరం చేసే ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ ఐసిడిఎస్ లక్ష్యం పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆహారం, ఆరోగ్యం, విద్య అందించాలని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోసం పోషణ టక్కర్, బాల సంజీవిని యాప్‌లు తీసుకొచ్చి లబ్ధిదారులను అంగనవాడీ సెంటర్లకు దూరం చేసే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పోషన్ ట్రాకర్ బాల సంజీవిని యాప్ ద్వారా సరుకులు ఇవ్వాలని నిర్ణయించారని, అయితే ఈ సరుకులన్నీ ఒకేసారిగా రావడం లేదని అన్నారు. ఈ సరుకులు ఇచ్చేటప్పుడు అంగన్వాడీ వర్కర్ ఫోటోతో పాటు లబ్ధిదారులకు ఫోటోలు తీసి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఫోన్లు పనిచేయకపోవడం, నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు విసిగిపోతున్నారన్నారు. అలాగే అంగన్వాడీలు మానసిక ఆవేదనకు గురవుతున్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ ఉండడం లేదన్నారు. కావున గతంలోగా లబ్ధిదారులతో సంతకం చేయించుకొని సరుకులు ఇచ్చే పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, ప్రీ స్కూల్ బలిజిపేటకి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యవతి, శారద, లక్ష్మి. స్వర్ణ,, పార్వతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడి సిబ్బందికి ఫేస్ యాప్‌ను రద్దుచేసి ఒక్క సెంటర్ నిర్వహణ యాప్ మాత్రమే ఉంచాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి. సరళ కుమారి,ప్రాజెక్టు కార్యదర్శి జె. సరోజ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిగా గల అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

పార్వతీపురం : ఐసిడిఎస్ లక్ష్యం పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం విద్య అందించడమేనని, కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్ తీసుకొచ్చి లబ్ధిదారులను అంగన్వాడి సెంటర్లకు దూరం చేసే విధానాలను అవలంబిస్తున్నాయని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పిఒకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పార్వతీపురం యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు గౌరీమణి, టి.రాజేశ్వరి, విజయలక్ష్మి, రాజేశ్వరి మొదలగు నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కురుపాం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పాలకొండ : ఎస్ఆర్‌సిని రద్దు చేయాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ గీతాంజలికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి బి.అమరవేణి మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే విధానాలు మానుకోవాలని, అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ భద్రగిరి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిబ్బందికి అంగన్వాడీలు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై. కస్తూరి, సత్యవతి మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మారుమూల ఏజెన్సీ ప్రాంతం కావడంతో సెల్ ఫోన్ సిగ్నల్స్ సరిగ్గా లేక ఆన్లైన్ సేవలు జరగడం లేదన్నారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు ఆన్లైన్లో చేయాలని అధికారుల ఒత్తిడితో ప్రీ స్కూల్ దెబ్బతింటుందన్నారు. కావున పాత పద్ధతిలోనే సంతకం పెట్టించుకుని సరుకులు ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కే గౌరీశ్వరరావు, సిపిఎం నాయకులు మండంగి రమణ ఉన్నారు.



సాలూరులో సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

పాచిపెంట : ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కొత్తకోట పార్వతీదేవి, అధ్యక్షులు దాలమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సిడిపిఒ బి.అనంతలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.రమా దేవి, సీనియర్ నాయకులు టి.ప్రభావతి, ఎ. సీత, సాయి, పూజ, ఎన్.బంగారమ్మ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు ఆందోళన చేశారు. వీరికి ఆందోళనకు అంగన్వాడి కార్యకర్తలు మద్దతు పలికారు. అనంతరం సిడిపిఒ సిమ్మలమ్మకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు పార్వతి, దర్శిమీ, అరుణ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు ప్రతి వస్తువులను ముఖ హాజరుతోనే పంపిణీ చేయాలని ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రాజెక్టు అధికారికి యూనియన్ నాయకులు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జానకి, యశోద, శశికళ, కుమారి, ఇందిర, సిఐటియు జిల్లా సహకార్యదర్శి ఎన్. వై నాయుడు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతర్

వందశాతం వికలాంగుడికి దక్కని సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం


వికలాంగుడు రవికుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి (ఫైల్)

సరిగ్గా ఏడాది క్రితం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వందశాతం వికలాంగుడికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. మంచానికే పరిమితమైన వికలాంగుడు రవికుమార్ రూ.15వేల పింఛను పొందడానికి అర్హుడని, వెంటనే ఆయనకు మంజూరయ్యేలా చూడాలని అప్పటి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని మంత్రి సంధ్యారాణి ఆదేశించారు. కానీ ఇంతవరకు అది కార్యరూపం దాల్చలేదు. గత ఏడాది ఆగస్టు 13న జియ్యమ్మవలస మండలం శింగనాపురానికి చెందిన రవికుమార్‌ను ఆటోలో తండ్రి జగన్నాధం ఆరోజు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు తీసుకొచ్చారు. రవికుమార్ రెండు కాళ్ళు చచ్చుబడిపోవడంతో మంచానికే పరిమితమయ్యారు. ఆయనకు నెలకి ఆరువేల రూపాయల పింఛను మంజూరవుతోంది. మంచానికే పరిమితమైన వికలాంగునికి రూ.15వేల పింఛను పొందడానికి అర్హులనీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు రవికుమార్‌ను గ్రీవెన్స్ సెల్‌కు తీసుకొచ్చారు. అప్పుడు గ్రీవెన్స్ సెల్‌లో ఉన్న జిల్లా మంత్రి సంధ్యారాణి కిందకు దిగి రవికుమార్ వద్దకు వచ్చారు. విషయం తెలుసుకుని ఆయనకు వెంటనే రూ.15వేలు పింఛను మంజూరయ్యేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. బాధితుడు రవికుమార్ తీసుకొచ్చిన దరఖాస్తుపై మంత్రి సంధ్యారాణి సంతకం చేసి అందజేశారు. ఆ సంతకం చేసిన దరఖాస్తుదారుడి సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. సోమవారం బాధితుడి తండ్రి మరోసారి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి దరఖాస్తు అందజేశారు. తన కుమారుడు రవికుమార్‌ను ఆటోలో తీసుకురావడం వ్యయప్రయాసలతో కూడుకున్న పని అని ఒక్కడినే వచ్చి గ్రీవెన్స్ సెల్ లో వినతిపత్రం అందజేశానని తండ్రి జగన్నాధం విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులు పని సర్దుబాటు చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయుల కోసం విద్యార్థులు వేచి ఉండరాదని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట సర్దుబాటు చేసుకోవాలని విద్యా శాఖాధికారిని ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తప్పకుండా విధులకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు రెండు, మూడు రోజులు పాఠశాలలకు హాజరు కానట్లయితే, వారి బాగోగులు తెలుసుకొని, అవసరమైతే వైద్య సిబ్బందిని పంపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల కారణంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కాలువలు, గెడ్డలు, వాగులు దాటే సమయంలో విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అటువంటి సమయంలో అవసరమైతే విద్యార్థులకు సెలవును ప్రకటించాలని సూచించారు. బడి బయట పిల్లలు ఉండరాదని, అటువంటి వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. కొందరు తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం అందక పోవడానికి గల కారణాలు తెలుసుకొని వివరాలు సమర్పించాలని సూచించారు. ప్రతి తహశీల్దార్ మార్గదర్శి కింద వసతి గృహల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే సచివాలయ సిబ్బంది అందరూ మరో వసతి గృహాన్ని దత్తత తీసుకొని, అక్కడి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లాలో తాగునీటి సమస్య ఉండరాదన్నారు. ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దని, వీలైనంత త్వరగా జారీచేయాలని మండల అధికారులకు తెలిపారు. ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పంచాయతీ శాఖ క్రియాశీలకంగా ఉండాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పీ 4 గ్రామసభలు జరుగుతున్నాయని, అన్ని చోట్ల సభలను పారదర్శకంగా నిర్వహించి, జాబితాలో మార్పులు, తొలగింపులు, కొత్త నమోదు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని అన్నారు. సమావేశంలో సమావేశంలో జెసి ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్డిఏ పీడీ ఎం. సుధారాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే సాగు నీరందేదెలా?

- పాడైన షటర్లు
- కాలువల్లో పేరుకు పోయిన పూడికలు

ప్రజాశక్తి - పాలకొండ


హుస్సేన్‌పురం వద్ద మరమ్మతుకు గురైన షట్టర్

తోటపల్లి ఎడమ కాలువకు ఈనెల 16న ఇరిగేషన్ అధికారులు సాగునీరు విడుదల చేసినప్పటికీ ఇంతవరకు శివారు ప్రాంతాల ఆయకట్టు దరికి చేరలేదు. డిస్ట్రిబ్యూటర్లకు షెట్టర్లు లేకుండా, కాలువల్లో పూడిక తీతలు తీయకుండా అధికారులు నీరు విడుదల చేస్తే ఏం ప్రయోజనమని రైతులు ప్రశ్నిస్తున్నారు. సాగునీరు విడుదల చేసినప్పుడు ఎగువ కాలువ షట్టర్లును మూసి వేస్తే శివారు భూములకు సాగు నీరందుతుంది. అయితే అటువంటి చర్యలు తీసుకోకుండా నీరు విడుదల చేయడం వల్ల తమకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదని రైతులు చెబుతున్నారు. మండలంలో 15 వేల ఎకరాలు వరి సాగు అవుతుంది. 7,8 బ్రాంచి కాలువల కింద ఉన్న ఆయకట్టుకు ఇంతవరకు ఒక్క చుక్క కూడా నీరు అందడం లేదు. దీంతో రైతులు ఇరిగేషన్ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు షెట్లర్లు ఏర్పాటు చేయాలని, ముదుములు మురమ్మతులు చేయాలని, కాలువల్లో పూడిక తీయాలని ఆయకట్టు ప్రాంత రైతులు కోరుతున్నారు.

పనులు చేయకుండా నీరిస్తే ఏం లాభం?

తోటపల్లి కాలువలో పేరుకుపోయిన పూడికలు తొలగించకుండా, షట్టర్ల మరమ్మతు పనులు చేయకుండా సాగురిస్తే ఎటువంటి ఉపయోగం లేదు. మండలంలో శివారు భూములకు ఇప్పటికీ ఒక్క చుక్క కూడా నీరు అంద లేదు. షెట్టర్లు పూర్తిగా పాడైపోయేవి మధుములు బలహీనంగా ఉన్నాయి లస్కర్ల వ్యవస్థ సరిగ్గా లేదు ఇవన్నీ సరిచేసి నీరు ఇస్తే రైతులకు ఉపయోగకరం.

కండాపు ప్రసాద్, అభ్యుదయ రైతు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 148 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తేల్చిచెప్పారు. అర్జీలపై సత్వరమే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణిలతో కలిసి ప్రజల నుంచి 148 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను తక్షణమే పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పార్వతీపురం మండలం కోటవానివలసకు చెందిన అల్లు ఆధ్యశ్రీకి మూడు చక్రాల సైకిలును, జియ్యమ్మవలసకు చెందిన ఎన్.గిరిధర్ పాత్రోకు హీరింగ్ ఎయిడ్స్ పరికరాలను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలపై తక్షణ చర్యలు : ఎస్‌పి

పార్వతీపురం టౌన్ : బాధితుల సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బి సిఐ ఆదాం, ఎస్సై ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 95 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు 95 మంది తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఈ.కుమార్, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, వ్యవసాయ అధికారి వై.వాహిని, పిహెచ్ఒ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భయ్యాడికి రోడ్డు వేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయతీ బయ్యాడ గ్రామానికి రేగిడి నుంచి బయ్యాడకు బిటి రోడ్డు నిర్మించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ రేగిడి నుంచి బయ్యాడకు నాలుగు కిలోమీటర్లు కొండమీద నడిచి వెళ్లాలని, రోడ్డు లేకపోవడంతో గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అనారోగ్యం పాలైతే డోలీలు కట్టి కిందకి దించాల్సిన పరిస్థితి ఉందని, అలాగే అటవీ ఉత్పత్తులు గాని, వ్యవసాయ ఉత్పత్తులు గాని అమ్ముకోవాలంటే తలలపై మోసి కిందకి దించాల్సిన పరిస్థితి వుందన్నారు. పిడిఎస్ బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు తలలపై మోసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఈ జిల్లా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎక్కడా డోలీమోతలు ఉండవని చెప్పారని తెలిపారు. ఎక్కడైనా డోలీమోతలు కనిపిస్తే కావాలని చేస్తున్నారని జిల్లా మంత్రి సంధ్యారాణి అంటున్నారని, ఇది సరైంది కాదని చెప్పారు. వాస్తవంగా రోడ్డు సమస్య లేకపోతే ఇంత మంది యువత కదిలి వచ్చేవారు కాదని అన్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు, జిల్లా మంత్రి స్పందించి కురుపాం, సీతంపేట, సాలూరు ఏజెన్సీల్లోని అనేక గిరిజన గ్రామాలకు రోడ్లు లేవని, వాటన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అమరావతికి రూ.15 వేల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం గిరిజన రోడ్లకు అప్పు తెచ్చి వేయలేరా అని విమర్శించారు. బయ్యాడకి రోడ్డు వేయకపోతే రానున్న రోజుల్లో కిందికి గిరిజనుల దిగరని నిద్రాహారాలు మాని రిలే నిరాహార దీక్షలు చేస్తూ బయ్యాడలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కద్రక రామస్వామి, పలువురు గిరిజన యువకులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భయ్యాడి గ్రామ యువత, సిపిఎం, గిరిజన సంఘ నాయకులు

ఉలిక్కిపడ్డ పిఆర్ఎన్ వలస

విశాఖలో గంజాయితో పట్టుబడ్డ యువకుడు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

మండలంలోని అడ్డాపుశీల పంచాయతీ పరిధిలో గల పిన్నింటి రామినాయుడు వలస (పిఆర్ఎన్) ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ గ్రామానికి చెందిన మరిపి గోవిందరావు (గౌతం) ఒడిశాలోని మల్కాజ్‌గిరి నుంచి గంజాయిను అక్రమ రవాణా చేస్తూ విశాఖ జిల్లా ఆనందపురం వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టు పడ్డాడు. విషయం తెలుసుకుని నిందితుడి స్వగ్రామమైన పిఆర్ఎన్ వలస ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసుల తనిఖీల్లో ఇద్దరు యువకులు మూడు బ్యాగుల్లో 34 కేజీల గంజాయితో పట్టుపడ్డారు. ఇందులో ఒక యువకుడు ఒడిశాకు చెందిన మైనర్ బాలుడు కాగా మరో వ్యక్తి పిన్నింటి రామి నాయుడు వలసకు చెందిన గౌతమ్‌గా గుర్తించారు. గంజాయిను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ వాసు నాయుడు వెల్లడించారు. ప్రశాంతంగా వ్యవసాయం చేస్తూ జీవన ఉపాధి సాగిస్తున్న పల్లె ప్రాంతంలోని యువకులు ఇలా అక్రమ గంజాయి రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నాడంటే తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


విశాఖలో పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ప్రజల చెంతకు నాణ్యమైన సరుకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన, మారుమూల గ్రామ ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సరుకులను అందించేందుకు గిరిబజార్ వాహనాలను అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ వాహనాలు నాణ్యమైన సరుకులను విక్రయించడంతో పాటు ఖాళీ సమయాల్లో డిజిటల్ స్క్రీన్ల ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యపరచనున్నట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధులతో రూపొందించిన గిరిచైతన్య వాహనాల ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని గిరి బజార్లను ప్రారంభించి, పచ్చ జెండా ఊపి గిరి చైతన్య వాహనాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలకు రెండు గిరిజజార్ వాహనాలను కేటాయించామన్నారు. ఈ వాహనాలను పార్వతీపురం జిల్లా మహిళా సమాఖ్య నిర్వహిస్తారని అన్నారు. ఇవి జిల్లాలో నిర్దేశించిన రూట్ మ్యాప్ ప్రకారం, ముఖ్యంగా గిరిజన సంతలు, మారుమూల గ్రామాలను కలుపుకుంటూ సంచరిస్తాయని తెలిపారు. ఈ వాహనాలలో ప్రముఖ కంపెనీల వస్తువులు, నిత్యావసర సరుకులు, వస్త్రాలు, ఫ్యాన్సీ సామాన్లు మొదలైనవి అందుబాటు ధరలలో లభిస్తాయని పేర్కొన్నారు. కావున ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా గిరిబజార్ వాహనాల్లోని వస్తువులను ఆసక్తితో తిలకించిన ఆయన మొదటి కొనుగోలు చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, ఐటిడిఎ పథక నిర్వహణాధికారి, డిపిఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, కోశాధికారి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గిరిబజార్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గిరిజనుల విద్యపై నిర్లక్ష్యం తగదు

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి- పార్వతీపురం

గిరిజనులకు మెరుగైన విద్య అందించేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కొన్ని గిరిజన పాఠశాలలకు ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల తీరుపై పత్రికలలో వచ్చిన కథనాలపై ఆయన సోమవారం ఒక ప్రకటనలో స్పందించారు. వివిధ కారణాల వల్ల ఇప్పటికే ఆదివాసీలు విద్యకు దూరమవుతున్నారని, పక్కా భవనాలు, ఉపాధ్యాయులు వున్న చోట, ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి వల్ల చిన్నారులు విద్యకు దూరం కావడం శోచనీయమన్నారు. మన్యం జిల్లాలో ఇటువంటి పాఠశాలలు ఇంకా ఎన్ని వున్నాయి, ఎందుకు సంబంధిత అధికారులు పాఠశాలలను పర్యవేక్షణ చేయడంలేదనే అంశాలపై జిల్లా యంత్రాంగం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాలని, గిరిజనులు చదువుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి -బలిజిపేట

మండలంలోని భైరిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గేదెల మేఘన జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించినట్లు ఎంఇఒ-1 ఎస్.సింహాచలం తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన మేఘన ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ జవహర్ నవోదయవిద్యాలయంలో సీటు సాధించడం పట్ల ఎంఇఒ అభినందనలు తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు వినతులు నిల్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక అర్జీ కూడా రాలేదన్నారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎపిఎం కె.రాము, ట్రాన్స్కో ఎఇ కె.అనిల్ కుమార్, హౌసింగ్ ఎఇ వి.వినోద్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జె.జ్యోతమ్మ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎటిడబ్ల్యుఒను నియమించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలానికి ఎటిడబ్ల్యుఒను నియమించాలని గిరిజన సంఘం నాయకులు కోరుతున్నారు. ఇక్కడ పని చేసిన ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ బదిలీపై వెళ్లారు. ప్రభుత్వం ఆ స్థానంలో వేరే వారిని నియమించినా నేటికీ జాయిన్ కాలేదు. దీంతో ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణ, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే అధికారి లేకపోవడం విచారకరం అంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఎటిడబ్ల్యుఒను నియమించాలని కోరారు.

మర్రిగూడకు రవాణా సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం లోని మర్రిగూడ గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ కడ్రక మల్లేశ్వరరావుకు వినతి ఇచ్చారు. రోగులు, గర్భిణీలను ఆసుపత్రికి మంచాలపై మోసుకొని పోయే పరిస్థితి ఉందన్నారు. వర్షం పడితే నడిచే అవకాశం కూడా లేదని ఇదే సమస్యను గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం అన్నారు. తమ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ సిబ్బంది మెరుపు దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన సందుబిలో గల నాటుసారా స్థావరాలపై సోమవారం రెండు రాష్ట్రాల ఎక్సైజ్ సిబ్బంది మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషనల్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు ఆదేశాల మేరకు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో 780 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని సారా తయారీకి సిద్ధంగా ఉన్న 5,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారీ చేసినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ సిబ్బంది, ఒడిస్సా రాయగడ జిల్లా ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

20 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని టిటుకపాయి గ్రామ సమీపాన సుమన్ రామారావును 20 లీటర్లు సారాపట్టుకున్నట్లు దోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా నిర్మూలనకు అందరు సహకరించాలని కోరారు. సారా విక్రయించినా, రవాణా చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు.

కాశీపేటలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేట గ్రామంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సీజన్లో జ్వరం, దగ్గు డయేరియా వంటి అంటు వ్యాధులతో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వేడి నీటిని తాగాలని సూచించారు. అనంతరం ఆరోగ్య తనిఖీలు నిర్వహించి అవసరం మేరకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని దయానిధిపురం, చిన్నారాయుడిపేట, చిన్న అంకలాం, గద్దలుప్పి, గాదెవలస గ్రామాలలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయా బూత్ స్థాయి ఇంఛార్జులు, నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో దయానిధిపురం సర్పంచ్ బి.రామారావు, చిన్నరాయుడుపేట నాయకులు సత్యనారాయణ, బొంకు సురేష్, కెఇఎస్‌ఆర్ పాల శ్రీనివాసరావు, కర్రి శంకర్రావు, సిహెచ్ సింహాచలం, తిరుపతిరావు, బి.శంకర్రావు, వై.ప్రసాద్‌రావు, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ చెరువులన్నీ ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఇరిగేషన్ మైనర్ చెరువులో మేజర్ చెరువులన్నీ ఆన్‌లైన్లో పొందుపరచాలని డిఎసిఒ జయప్రకాష్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన సోమవారం వీఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని చెరువులను ఆన్‌లైన్‌లో పొందుపరచి నీటి సాంద్రత భూ విస్తీర్ణం వంటలు వివరాలు అన్నీ అందులో పొందుపరచవలసిందిగా తహశీల్దార్ బి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వెంగళరాయ సాగర్ ప్రాజెక్ట్ నీటి విడుదలను చేశారు కనుక సరి చివరి భూములకు నీటిని అందించేలా పర్యవేక్షించాలని ఆయా గ్రామ వీఆర్వోలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ ఎస్ శ్రీనివాసరావు, వివిధ గ్రామాల వీఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులుగా తమ్మయ్య

ప్రజాశక్తి - కొమరాడ

మన్యం జిల్లా, గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులుగా బిడ్డిక తమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఐక్యవేదికను ప్రధాన కార్యదర్శి జలుమూరు మణికుమార్, గౌరవ అధ్యక్షులు గేదెల రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఊరటాల సత్యం, ఉలిపిరి పంచాయతీ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఉర్లక వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు ప్రస్తుతం ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కల్పించిన సంక్షేమ అభివృద్ధి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు పూర్తిగా పొందలేకపోతున్నామని అన్నారు. ఆ తరుణంలో మళ్లీ బోయ వాల్మీకులను తీసుకొచ్చి తమ కులాలలో కలిపితే తమకు అనేక విధాలుగా అనేక రంగాలలో నష్టపోతామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని మన్యం జిల్లా తరఫున నాయకులకు కోరుతున్నామన్నారు.

కెజిబివి సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసిన కరాసువలస కెజిబివి ఎస్ఒ, సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యాన వారు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ పథకాలు, సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను చిన్నచిన్న కారణాలతో తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సాలూరు మండలం కరాసవలస కెజిబివి సిబ్బందిని తొలగించారని అన్నారు. మంత్రి సంధ్యారాణి పర్యటన నేపథ్యంలో అక్కడ వంటలో నాణ్యత లేదన్న చిన్న



నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు, బాధితులు

కారణాన్నీ చూపించి ఐదుగురు ఉద్యోగులను విధుల నుండి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చిన్నచిన్న కారణాలతో ఉద్యోగులను తొలగించి తమ అనుయాయులకు ఉద్యోగాలు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నంలా కనిపిస్తోందని చెప్పారు. ఇప్పటికైనా అక్రమంగా తొలగించిన కరాసవలస కెజిబివి స్పెషల్ ఆఫీసర్, కుక్ తదితర సిబ్బందిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, అఖిల్, డేవిడ్ పాల్గొన్నారు.

కెజిబివి ఎస్ఒ సస్పెన్షన్ ఎత్తివేయాలి

సాలూరు మండలం, కరాసు వలస కెజిబివి పాఠశాల ఎస్ఒ సస్పెన్షన్ ఎత్తి వేయాలని గిరిజన సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు కలిసి వినతిపత్రం పత్రం అందజేశారు. పాఠశాలలో జరిగిన పరిణామాలకు ఎస్ఒకు నేరుగా ఎటువంటి సంబంధం లేదని వివరించారు. పిటిజి తెగకు చెందిన ఎస్ఒ సస్పెషన్ తక్షణమే ఎత్తి వేయాలని కలెక్టర్‌ని కోరారు.

హెల్మెట్లు ధరించాలి

ప్రజాశక్తి- సీతానగరం


వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్ఐ ఎం. రాజేష్ తెలిపారు. సోమవారం స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఆయన ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, దీని వల్ల వారికి ఎంతో మేలుజరుగుతోందని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి అనవసరపు కాల్స్ వస్తే వాటిని తిరస్కరించాలని, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసేజ్‌లను గమనించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని ప్రతి ఇంటి యజమాని వారి పిల్లల పట్ల ఎప్పుడూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తిరుపతిరావు, నాయుడు పాల్గొన్నారు.

మంత్రి మొదటి సంతకం అమలైందా?

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన గుమ్మిడి సంధ్యారాణి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులను నియమించి గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడుతానని ప్రమాణ స్వీకారం చేసిన మొదటి సంతకంగా, ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ఆక్షేపించారు. మండలంలోని కురుకుటిలో సోమవారం నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీని మొదటి సంతకంగా భావించి ప్రతి ఒక్క హాస్టల్లో ఎఎన్ఎం ఉద్యోగులను నియమించి విద్యార్థులకు ఆరోగ్యం కాపాడుతానని చెప్పి నేటికీ 16 నెలలవుతున్నా కనీసం దాని గురించి పట్టించుకొనే పాపాన లేదన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమంలో గతంలోనే మేం చేసిన అభివృద్ధిని తమ అభివృద్ధిగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గిరిజన గ్రామాలకు రోడ్లు వేశామని, మౌలిక వసతులు కల్పించామని గొప్పగా చెప్పుకుంటున్నారని, తాము చేసిన అభివృద్ధిని మీరు చేశామని చెప్పుకోవడం ఎంతవరకు సబమని ఆమెను ప్రశ్నించారు. నా కంటే ముందు నాలుగు దఫాలుగా రాష్ట్ర స్థాయిలో పదవులు అనుభవించిన మీరు ఈ గిరిజన ప్రాంతానికి ఎటువంటి అభివద్ధి చేశారో తెలియజేయాలని, గత ఆరేళ్లుగా ఎమ్మెల్సీగా ఉన్న మీరు ఎక్కడ ఎటువంటి అభివృద్ధి చేపట్టారో ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. 18 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న తాను ఎన్నికల్లో ఏవైతే హామీలు ఇచ్చానో వాటన్నింటినీ నెరవేర్చానని అన్నారు. గిరి శిఖర గ్రామాలకు రహదారులు వేసిందే తామని, ప్రతి గ్రామం నుండి మైదాన ప్రాంతానికి కనెక్టివిటీని కల్పించి వారికి మైదాన ప్రాంతాలతో అనుబంధాన్ని ఏర్పరిచామని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన వారికి ఇచ్చామని, మీలా కక్ష సాధింపులకు ఎవర్నీ గురి చేయలేదని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని

మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర



సాలూరు: మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

నెరవేర్చే వరకు వైసిపి తరపున ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటామని ఆయన తెలిపారు. కురుకుట్టి సర్పంచ్ అప్పన్న, గెమ్మెల సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో సాలూరు నుండి గంగన్న దొర వలస డబల్ రోడ్, గంగన్న దొర వలస నుంచి కురుకుట్టి డబుల్ రోడ్, కందుల పదం బ్రిడ్జి, వెలగ వలస బ్రిడ్జి, తాడి వలస బ్రిడ్జి, దండిగాం నుంచి కోటియా బిటి రోడ్డు, తోనాం, మామిడిపల్లి ఆసుపత్రులు, పేదలకు పక్కా గృహాలు, ఎంతోమంది పేదలైన నిరుద్యోగులకు ఉద్యోగాలను ఇచ్చారని అన్నారు. వెనుకబడిన ఈ మండలంలో ప్రతి గిరిజన ప్రాంతము అభివద్ధి చెందిందంటే అది రాజన్నదొరతోనే సాధ్యమైందని తెలిపారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేస్తున్న మోసాలను కరపత్రాల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ శ్రీనివాసరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సువ్వాడ రామకృష్ణ, వైసీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచులు నూకయ్య, సుదర్శనరావు, అదయ్య, ఎంపిటిసిలు జన్ని సీతారాం, అదయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చినంకలం, సుభద్ర, సీతారాంపురం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, నియోజక వర్గం రైతు విభాగం అధ్యక్షుడు ఆర్వీ, జిల్లా అనుబంధ విభాగం నాయకులు, సర్పంచులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: చంద్రబాబు ప్రభుత్వం ప్రతి ఇంటికీ వంచన చేసిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పురపాలక సంఘం 29వ వార్డులో సోమవారం స్థానిక కౌన్సిలర్ ఏడ్ల త్రినాథ అధ్యక్షతన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలను వివరించారు. ప్రజలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు సువ్వాడ లావణ్య, నిమ్మకాయల సుధీర్, నేతాజీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వేశెట్టి శ్రీనివాసరావు, మైనారిటీ సెల్ అధ్యక్షులు సఫీ, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు గొర్లి మాధవరావు, కోల సుధా, రాష్ట్ర అనుబంధ విభాగాల కార్యదర్శులు గండి భాగ్యలక్ష్మి, డి నాగరాజు, ముగడ జగన్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన మాట, పెట్టిన మొదటి సంతకం మేరకు తక్షణమే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్యం (ఏఎన్ఎం) సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఏటా గిరిజన విద్యార్థులు మరణాలు జరుగుతున్నా ప్రభుత్వానికి, మంత్రులు, ఎమ్మెల్యేలకు పట్టదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విద్యా సంవత్సరం పార్వతీపురం ఐటిడిఎలో ఇద్దరు గిరిజన బాలికలు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన డబ్బులతో అడ్డగోలు, అవసరం లేని భవనాలు, వాటికీ రంగులు, మరమ్మత్తులు ఎందుకని ప్రశ్నించారు. ఐటిడిఎ డబ్బులతో ఏఎన్ఎంల నియామకం చేసి గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడ వచ్చు అని వివరించారు. దీక్షల్లో గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం, ఏఐఎస్ఎఫ్, పేరెంట్స్ అసోసియేషన్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ తదితరు సంఘాల నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికొప్పుల రామకృష్ణ, రొబ్బ లోవరాజు, బీ.రవికుమార్, వంగల దాలి నాయుడు, గణేష్, బంగార్రాజు, హెల్త్ వాలంటీర్లు రజిని, సుజాత, శ్రీరంజని, సత్య, రాజేశ్వరి, చంద్రకళ, రమణమ్మ, గౌరిశ్వరి పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రధాన పంటల్లోని అంతర్ పంటలు వేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని, ప్రధాన పంటకు కావాల్సిన సాగు ఖర్చులను అంతర్ పంటల ద్వారా పొందవచ్చని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కర్రివలసలో రైతు లండ నారాయణరావు ఎల్2 విజయ్ ఆధ్వర్యంలో తన రెండు ఎకరాల పత్తి క్షేత్రంలో వేస్తున్న పెసర, మినుము అంతర్ పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ అక్కడక్కడ చిక్కుడు, గోంగూర, బెండ వేస్తూ చుట్టూ ఆనప, బీర పాదులను పెట్టడం వలన ఒక నెలలోనే నాలుగు వేల రూపాయలు అదనపు ఆదాయాన్ని పొందగలిగానని తెలిపారు. ఇప్పుడు పత్తి వరుసల మధ్య పెసర, మినుము, చోడి పంటలను వేస్తున్నానని తెలిపారు. చుట్టుపక్కల సుమారు పదిమంది రైతులు పది ఎకరాల్లో పత్తిలో అపరాలు అంతర్‌పంటగా వేయడానికి ముందుకొచ్చారని తెలిపారు.

అనంతరం ఎఒ మాట్లాడుతూ అంతర్ పంటల వల్ల అధిక ఆదాయం రావడమే కాకుండా భూమిలో వివిధ రకాల వేరు వ్యవస్థలు ఉండడం వల్ల ప్రధాన పంటకు అనేక రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని మిత్రపురుగుల సంఖ్య పెరిగి చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కనీస గ్యారెంటీ దిగుబడి ఏదో ఒక పంట ద్వారా అందుతుందని, మనం వేసే ఎరువులు ఇతర పోషకాలు అన్ని వృథా కాకుండా వినియోగించబడతాయని, కావున రైతులు ఏకపంట విధానాన్ని విడిచి అంతర్ పంటలు బహుళ పంటలు విధానాలకు మళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంటి యశోదమ్మ ఐ సి ఆర్ పి సుమలత పాల్గొన్నారు.

వంట మనుషులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

బలిజిపేట మండలం అరసాడ ఎంపిపి స్కూల్, జిల్లా పరిషత్ హై స్కూల్లో పనిచేసిన వంటమనుషులు, నైట్ వాచ్ మెన్ గొడబ పార్వతి, గొడబ చిన్న పార్వతి, కుట్టిష కళావతి, అరసాడ ఈశ్వరమ్మ, అరసాడ అప్పిశెట్టిను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యాన బాధితులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ హైకోర్టు, రాష్ట్ర గవర్నర్ ఉత్తర్వుల ప్రకారం తొలగించిన వంటమనుషులు, నైట్ వాచ్ మెన్‌లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా నియమించిన వారి పేరున బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేయమని డిఇఒ రాజ్‌కుమార్ ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. అరసాడ ఎంపిపి స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్లో గత 22 ఏళ్లుగా వంట చేస్తున్న గిరిజన, రజిక మహిళలను కులం పేరుతో దూషిస్తూ రాజకీయ కక్షతో అన్యాయంగా తొలగించారని చెప్పారు. కలెక్టర్, డిఇఒ, తహశీల్దార్ ఎంపిడిఒ, ఎంఇఒలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తప్పని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా కలెక్టర్ లీగల్ సెల్ ఉత్తర్వులు రాష్ట్ర గవర్నర్ ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని కోరుతున్నా రాజకీయ ఒత్తిడి కారణంగా తీసుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తొలగించిన వంటమనుషులు నైట్ వాచ్ మెన్‌లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిఐటియు ఆధ్వర్యాన బాధితుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు, నాయకులు

ప్రతి ఇంటికీ మంచినీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలోని మారుమల గ్రామానికి ఇంటింటికీ కుళాయిల ద్వారా మంచినీరు అందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కొత్త తోడుము, పులిగుమ్మిలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పదివేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఇంటింటికి మంచినీర ందించేందుకు జలజీవన్ మిషన్ పథకంలో ద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజలకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌరీశంకర్, మండల టిడిపి అధ్యక్షులు సేనాపతి శేఖర్ పాత్రుడు, కురుపాం ఎఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్రావు, నాయకులు వి రాఘవ, మోహన్‌రావు, సర్పంచులు సింహాచలం, విజయలక్ష్మి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన కూలీలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు మాట్లాడుతూ గోలీల వెంకంపేటలో ఏడు గ్రూపులకు గత ఏడు వారాల నుంచి బిల్లులు మంజూరు చేయలేదని, దీంతో కూలీలంతా ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, 15 రోజులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మేట్లకు ప్రోత్సాహం, రెండుపూట్లా పని రద్దు, పార, గుణపాలకు డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి బకాయిలు చెల్లించకపోతే రానున్న రోజుల్లో కూలీలను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పచ్చిరొట్టతో మట్టికి జీవం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం కలుగుతుందని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. వ్యవసాయశాఖ రూపొందించిన పచ్చిరొట్ట పైర్లను వాడడం ద్వారా 25 శాతం ఎరువులు ఆదా అనే పోస్టర్‌ను తన కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆవిష్కరించారు. పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందని, ఈ ఎరువు వినియోగించడం, వర్షాకాలానికి ముందు పొడి విత్తనాలు విత్తడం వల్ల నేలసారం పెరుగుతుందని తెలిపారు. నేల నిర్మాణం పటిష్టంగా తయారు కావడంతో పాటు, ఆరోగ్యకరమైన నేలగా మారి, నేలలో పోషకాల వృథా తగ్గింపు జరుగుతుందని పేర్కొన్నారు. సాగు ఖర్చులు తగ్గిస్తుందని, 25 శాతం మేర ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాయని ఆయన వివరించారు. నానో యూరియా, నానో ఎరువులతో రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. యూరియా, ఎరువులను మోతాదుకు మించి వినియోగించరాదని ఆయన కోరారు. కార్యక్రమంలో జెసి ఎస్ ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం సుధారాణి, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మథ రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంకు చెందిన నందిస శ్రీదేవి అనారోగ్యానికి గురై బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సిఎం సహాయ నిధి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఈ మేరకు సోమవారం గుమ్మలక్ష్మీపురంలో గల తన క్యాంపు కార్యాలయం వద్ద శ్రీదేవికి రూ.53,836 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తాను అనారోగ్యంతో బాధపడుతున్నానన్న విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సిఎం సహాయ నిధి నుండి మంజూరు చేయించి ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి కన్వీనర్ అడ్డాకుల నరేష్, కురుపాం క్లస్టర్ ఇన్చార్జి సుకేష్ చంద్ర పండా, నాయకులు ప్రసాదరావు, మౌళి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు, మందులు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు సేవలు అందిస్తున్న 104 సిబ్బంది పనితీరు మెరుగుపడాలని, ముఖ్యంగా అందులో రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్య పరికరాల పనితీరు సక్రమంగా ఉండాలని, పంపిణీ చేస్తున్న మందులు కూడా రోగులకు అందేలా చూడాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి పిఎల్ రఘు సూచించారు. మండలం లోని విఆర్ పేట గ్రామంలో సోమవారం జరిగిన 104 సంచార వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు నిర్వహిస్తున్న వైద్య తనికీళ్లతో పాటు చికిత్సను పరిశీలించారు. వాహనంలో ఉండే ఈసీజీ యంత్రం పనితీరుతో పాటు మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. రోగుల తనిఖీలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు కూడా నెలవారీ సక్రమంగా 104 వాహనాల్లోని జరగాలని, అధిక రక్తపోటు మధుమేహం తదితర మందులు రోగులకు సక్రమంగా పూర్తిస్థాయిలో అందాలని అన్నారు. జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో రక్త నమూనాలు కూడా సేకరించాలన్నారు. ఆయనతోపాటు బందలుప్పి పిహెచ్‌సి వైద్యులు, 104 సిబ్బంది, ఏఎన్ఎంలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు హాస్టల్ భోజనాన్ని ఎంఇఒ జి.సూరిదేముడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని, బియ్యాన్ని పరిశుభ్రం చేసి ఉండాలని పలు సూచనలు చేశారు. భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు.

భోజనం ఏమైనా బాగోలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవడం తప్పన హెచ్చరించారు. ఆమెతో పాటు ప్రిన్సిపల్ రాజారావు, విద్యార్థులు ఉన్నారు.

సీలింగ్ ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని విక్రమపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సోమవారం స్వామి సేవా సమితి సభ్యులు రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరిశంకరరావుకు 6 సీలింగ్ ఫ్యాన్‌లు అందజేసినట్లు రామ్మోహన్‌రావు తెలిపారు. స్వామి సేవ సమితి ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఆకలితో ఉన్న ప్రజలకు ఆహారం అందించడం, నిరాశ్రయులకు వసతి కల్పించి వారికి మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో సభ్యులంతా కలిసి ఫ్యాన్లు వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి.చినతిరుపతిరావు, అరుకు పార్లమెంట్ రైతు కమిటీ అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, ఉపాధ్యాయులు రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనకు కళాజాత

ప్రజాశక్తి- పార్వతీపురం

గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాలను ఏర్పాటు చేస్తున్నామని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ముందుగా ఐటిడిఎ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన కళాజాత ప్రదర్శన తీరును ఆయన తిలకించారు. ఏఏ అంశాలపై ప్రజలకు ఏ మేరకు అవగాహన కల్పిస్తారన్నది గమనించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ లో ఏజెన్సీలో జ్వరాలు ప్రభావం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు,అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన మరింత సులభతరం చేసేందుకు కళాజాత దోహదపడుతుందని అన్నారు.